# అస్తవ్యస్తం

-డా॥ ముక్తేవి భారతి

విజయ్ చల్లగాలి కోసం డాబా మీద కూచున్నాడు. పక్కనే వున్న మరో కుర్చీలో కూచుని, గోళ్ళకున్న ఎర్ర రంగు చూసుకుంటోంది కవిత.

'నీకు కోపం వస్తుంది, అయినా ఓ మాట చెప్తా' అన్నాడు పిట్టగోడ నానుకుని నిల్చున్న విజయ్.

కవిత చెల్లెలు రమ ఎమ్మెస్సీ చదువుతోంది అక్క దగ్గరుండి, అమ్మా నాన్న అమెరికాలో వున్నారు కనుక. ఇప్పుడు రమకి గార్డియన్స్ వీళ్ళే... అందుకే ఇప్పుడు విజయ్‌కి కోపం రావడానికి కారణం–

'మీ చెల్లెల్ని ఓ కంట కనిపెట్టు' అన్నాడు.

'ఏమైందీ' అంది కంగారుగా కవిత.

'మీ అమ్మా నాన్నలకి అసలు బుద్ధి లేదు' అన్నాడు వీధి వంక చూస్తూ విజయ్.

'మధ్యలో అమ్మా నాన్నా ఏం చేశారూ' అంటూ కవిత అనగానే, "అవును, మళ్ళా అంటాను, మీ అమ్మా నాన్నకి లోకజ్ఞానం లేదు" అన్నాడు. "వయసులో వున్న పిల్లకి పెళ్ళి చేయాలనే ఆలోచన రాదా!" అన్నాడు చిరాగ్గా.

"ఓ అదా... దాని పెళ్ళి విషయం వాళ్ళు చూసుకుంటారు. ఈ ఏడాదితో చదువు అయి వెళ్ళిపోతుంది – మీకేం బాధా' అంది కవిత. మెడలో గొలుసు సరి చేసుకుంటూ 'అటు చూడు'

రమ స్కూటర్ ఆపి సెల్‌ఫోన్‌లో, అక్కడే నిలబడి మాట్లాడుతోంది చాలాసేపట్నుంచీ.

ఎవరితో– ఎంతసేపూ– ఏమో!!

❖ ❖ ❖

కవిత చెల్లెలి పద్ధతిలో మార్పు గమనిస్తోందీ మధ్య. నాలుగు రోజుల నాడు టాంక్‌బండ్ దగ్గర ఓ కుర్రాడితో మాట్లాడుతూ పాప్‌కారన్ తింటుంటే చూశానన్నాడు విజయ్.

'మీరు అనవసరంగా మాట్లాడొద్దు – మా చెల్లెలు అలాటిది కాదు' అంది కవిత ఆరోజు.

మేడమీదున్న అక్క బావ దగ్గరికి మహా ఉత్సాహంగా వచ్చింది రమ.

'ఎవరితో కబుర్లు – అంతసేపు – లోపలకొచ్చి మాట్లాడొచ్చుగా –' అంది కవిత చెల్లెలితో

"రమా... మొన్న నువ్వు, ఒకబ్బాయి పాప్‌కారన్ తింటూ టాంక్‌బండ్ దగ్గర..? మాట పూర్తి కాకుండానే రమ విరగబడి నవ్వి, పాప్‌కారన్, ఐ హేట్ ఇట్ – తింటే గొప్ప ఐస్‌క్రీమ్ తినాలి కానీ – బావగారూ, మీరు ఎవర్ని చూసి ఎవరనుకున్నారో–' అలా అంటుండగానే సెల్ మోగింది. రమ ఓ మూలకెళ్ళి గబగబా ఏదో అంది. 'ఐ యామ్ రెడీ, బై'... రమ బాగ్‌లో సెల్ పెట్టుకుని, "ఇద్దరూ వినండి – మీరేమన్నా అనుకోండి – మీరు వద్దన్నా నేను మానను – రేపు పొద్దున్న నేను, శశి ఓ వారం రోజులు బెంగుళూరు వర్క్‌షాప్‌కి వెడుతున్నాం.'

'ఆఫీసు పనిమీదేనా' అంది కవిత.

'ఆ..' అంది రమ. అంతలో సెల్ మోగింది.

రమ గబగబా కిందికి దిగింది మాట్లాడుతూ.

'ఆ పిల్ల, ఇది కలసి వెడితే మనకి బెంగ ఉండదు లెండి' అంది కవిత.

రమ సూట్‌కేసు సర్దుకుంటోంది. విజయ్ ఆ గదిలో కొచ్చాడు.

'రమా, ఆ సూట్‌కేసు నిండా బట్టలే పెట్టుకో – ప్రయాణంలో ఎన్ని డ్రస్సులున్నా చాలవని, అక్కడ నువ్వు, ఆ శశి బట్టలుతుక్కుంటూ కూర్చోరుగా అని మీ అక్క అంటోంది. అదీ నిజమే – పుస్తకాలు, కావాలంటే నా బ్యాగ్ ఇస్తా' అన్నాడు విజయ్.

రమ పగలబడి నవ్వింది. ఎందుకు నవ్విందో అర్థం కాలేదు విజయ్‌కి. "నేను పెట్టెనిండా బుక్స్ పట్టుకెడదామనుకున్నా – బాగా గుర్తుచేశారు – ఇద్దరం ఆడపిల్లలం కదా – ఎన్ని డ్రస్సులున్నా తక్కువే" అంటూ, 'అక్కా ఈ నైటీ బావుందా, ఈ డ్రెస్ బావుందా' అంటూ, ఒకటొకటే చూపిస్తూ, సూట్‌కేసు సర్దుకుంది రమ – గుమ్మంలో నుంచున్న అక్కవైపు చూస్తూ.

'నువ్వు, ఆ శశి ఇక్కడే దిగండి... భోంచేశాక వాళ్లింటికి పంపిద్దాం' అంది కవిత. 'ఆ' అంది కళ్ళజోడు తుడుచుకుంటూ, బావకేసి చూస్తూ.

❖ ❖ ❖

రమ బెంగుళూరెళ్ళి రెండు రోజులయింది.

చేరగానే ఫోన్ చేసింది.

'అవును, అది బిజీ.. క్షణం తీరికుండదు పాపం' అంది కవిత భర్తతో.

'అవును బిజీ' అన్నాడు విజయ్ పేపరు ముఖానికి అడ్డం పెట్టుకుని.

"మీరు ఊరికే భయపడ్డారు - అది ఎవరితోనో అక్కడ కనిపించింది, ఇక్కడ కనిపించింది అనీ. పైగా మా అమ్మా నాన్నకి బుద్ధిలేదని కూడా అన్నారుగా - నే చెప్పలేదండీ, దానికి ఈ బాయ్‌ఫ్రెండ్సు గోల లేదు' అంది కవిత.

'ఓహో..' అన్నాడు భర్త.

'మీరు కవితని స్టేషన్‌లో దింపినపుడు ఆ పిల్లని చూశారా' అంది కవిత భర్తతో.

ఉలిక్కిపడ్డాడు.

"నేనెక్కడ చూశానూ, స్టేషన్ దగ్గరే దిగింది మీ చెల్లెలు. బావగారూ, మీరెళ్ళండి - ఆఫీసుకి టైమయి పోతుందని - నేనెక్కడ చూశానూ" అన్నాడు చేతిలో సిగరెట్టు దూరంగా విసిరికొట్టి విజయ్.

❖ ❖ ❖

కవిత వాళ్ళ ఔట్‌హౌస్‌లో, ఓ గదిలో వుంటున్నారు వీరయ్య, భార్య అంజమ్మ. వీరయ్య ఇంట్లో పనులు చేస్తాడు. అంజమ్మ వంట చేస్తుంది.

'అంజమ్మా, రేపు రమ, శశి వస్తారు - భోజనం బాగా చేయి - అక్కడ ఏం తిన్నారో ఏమో' అంది కవిత వంటింట్లోకొచ్చి.

'శశిగారు మంచివారండి' అంది ఫ్రిజ్‌లోంచి పెరుగు బయటకు తీస్తూ అంజమ్మ.

'ఏమిటీ, శశి నీకు తెలుసా' అంది కవిత కాస్త ఆశ్చర్యంగా.

'అదేంటమ్మగారూ.. ఎన్నిసార్లు ఇద్దరికీ భోజనం పెట్టాను నేను, పైగా, మా వీరయ్య చేత పాపగారు సినిమా టిక్కెట్లు తెప్పిస్తారండి.. మొన్న నన్ను కూడా రమ్మంటే, అమ్మ అయ్యా ఉద్యోగాలకెళ్ళి ఇంటికొచ్చే వరకు నేను అలా రానని చెప్పానండి - ఆళ్ళతో పాటు సినిమాలకెడితే, ఇల్లు ఎలాగండీ' అంది అంజమ్మ.

'మరి నాకు చెప్పలేదేం' అంది కవిత.

'చెప్పేదేముందండీ - పాపగారి స్నేహితులు మనింట్లో భోజనం చెయ్యటం నాకు కొత్తా...' అంది కుక్కరు కూతకి చెవి మూసుకుంటూ అంజమ్మ.

❖ ❖ ❖

అనుకున్న ప్రకారం రమ వచ్చేసింది ఊరునుంచి.

'దాన్ని కూడా రమ్మన్నానుగా' అంది చెల్లెల్ని చూస్తూ కవిత.

'అదెవరూ' అంది రమ.

'శశి...'

'ఓ - శశి, యస్, శశి' - రమ నవ్వు ఆపుకుంటూ బావకేసి చూసింది.

'ఎవరికైనా ప్రయాణం బడలికేగా' అంది సూట్‌కేసు తీసుకుని లోపల పెడుతూ.

మరదలి వంక చూస్తూ, 'బాగా అయిందా ట్రిప్పు' అన్నాడు విజయ.

"ట్రిప్పేంటీ, ఊపిరాడనంత పని - శశి నేను ఆ సెమినార్ గొడవలోనే మునిగిపోయాం' అంది రబ్బరు బాండ్ తీసి, జుట్టు విరబోసుకుంటూ రమ.

❖ ❖ ❖

కవిత చెల్లెల్ని గమనిస్తోంది... వచ్చినప్పట్నుంచీ ఫోన్లే - తిండి గోల కూడా లేదీ పిల్లకి, ఏమిటో - ఏదైనా అమ్మా నాన్నకి చెప్పాలి, దీనికి పెళ్లి చేసేయాలింక అని, చదువులకేం, జీవితమంతా చదువుకోవచ్చు

## అస్తిత్వ పరివేదన

పరవశించిన క్షణాలలోనే
ఘనీభవించిన అస్తిత్వ పరివేదన,
ఒక్కమాట
ఒక్క పల్కరింపుతో
కన్నీరైన కరుణ,
ఒంటరితనం కాస్సేపు
స్నేహసాగరంలో మునిగినా
తీరని సమస్యల తీరంలో
అదే అశాంతి
అదే వేదనామయ గాథ!
సమాధానాలు దొరకని
నిరంతర సంభాషణలో
ఆగని ఆత్మగౌరవయాత్ర
ఒకింత ఎక్కడో సమాధానపడినా
మళ్ళీ ఉనికి కోసం-
ప్రశ్నల పరంపర...!!

**-నిఖిల్**

అనుకుంటూ, చెల్లెలి గదిలో కొచ్చింది.

"ఏమే.. బెంగుళూరు వెళ్ళారు కదా.. అక్కడే మైసూరు, శ్రావణ బెళగోళ – ఇలా అన్నీ చూసిరాకపోయారా' అంది.

"అక్కా నువ్వు నమ్మవు, ఒక్క నిముషం తీరిక లేదనుకో – అందుకే నేనూ, శశి అనుకున్నాం, మరో సారి తీరిగ్గా వెళ్దాం అని' అంది రమ.

'ఆ శశిని ఒక్కసారి రమ్మను, నేను చూడనేలేదు – ఆ రోజు బావగారొచ్చినా, ఆఫీసుకి టైమయిపోతుందని వెళ్ళిపొమ్మన్నావుట కదా...' అక్క ఏమిటో అంటోంది.

"బావగార్ని వెళ్లిపొమ్మన్నానా – శశిని చూడలేదా – ఓ కరక్ట్ అన్నాను. అర్థమయింది బావగారాడిన అబద్ధం"

"ఆ... ఆ" అంటూ, రమ గుమ్మంలో నుంచున్న బావగారి కేసి చూసి నవ్వింది.

❖ ❖ ❖

రెండు రోజులయింది. కాలింగ్ బెల్ మోగింది. ఒక్క పరుగున వెళ్ళి తలుపు తీసింది రమ.

'హాయ్' అన్నాడు విజయ్ శశిని చూస్తూ.

"అక్కా రా, శశిని చూపిస్తాను' అంది రమ ఉత్సాహంగా.

కవితకి నోట మాట రాలేదు... శశి అంటే!!

"శశికాంత్ – ఇతనే అక్కా – బెంగుళూరులో ఆ రోజు నాకు జ్వరం వస్తే, మందు తెచ్చి, మహా ఖంగారు పడిపోయాడు, పాపం" అంటూ.. "శశీ మా అక్క బావగారు తెలుసుగా" అంది రమ.

"ఆ రోజు స్టేషన్‌లో చూశాగా" అన్నాడు శశి.

కవిత విస్తుపోయింది.

కవిత లోపల కెళ్ళిపోయింది.

అమ్మో, ఎంత మోసం – ఆ రోజు స్టేషన్‌లో చూశారా... చూసి కూడా శశి అంటే ఆడపిల్ల అనే నాతో చెప్తున్నారా – అంటే, ఈ కుట్ర పన్నింది బావ మరదళ్ళా – నేను పరాయిదాన్నా...

అయినా, అలా ఓ అబ్బాయితో కలసి వారం రోజులు బెంగుళూరు వెడుతుంటే తెలిసి కూడా వద్దని చెప్పడా విజయ్!! – ఏమిటిదీ –

ఇది వాణ్ణి ప్రేమిస్తుంటే, నేను కాదనేదాన్ని, బావ ఒప్పుకునేవాడూనా – అయినా ఎంత తెగింపు దీనికి – అమ్మా నాన్నలకీ విషయం తెలిస్తే ముందు నన్ను చంపేస్తారు!!

పెళ్ళి చేసుకోకుండా ... అబ్బ, ఏమిటో, – కవిత మనసు ఉక్కిరి బిక్కిరిగా వుంది – పైగా, తనతో చెప్పకుండా ఇంత దాచిన తన భర్తపై కోపం కట్టలు తెంచుకుంది.

❖ ❖ ❖

"చూడు, నా మాట విను, మీ చెల్లెలు, శశికాంత్, అనే అబ్బాయి కలిసి వెడుతున్నారంటే నువు ఒప్పుకోవు కదా – పైగా, రమ చిన్నపిల్ల కాదు, తన జాగ్రత్త తనకే తెలియాలి... నేను వద్దన్నా మీరు అనవసరంగా అపోహ పడకండి, 'ఐ నో, వాట్ అయామ్' అంది. మీ చెల్లెలు" అన్నాడు విజయ్ కవితని గుండెలకి హత్తుకుంటూ. కవిత కళ్ళలో తిరిగిన నీళ్ళు తుడుచుకుంది.

ఒక్క సాయం చేయండి, ఇప్పుడర్థమయింది కదా అతన్ని అది ప్రేమిస్తోందనీ – అతనితో మాట్లాడండి. అమ్మా నాన్నకి చెప్దాం.

కవిత మాటలు వినిపించుకోనట్టు ఊరుకున్నాడు విజయ్. కానీ గుమ్మంలో నించున్న రమ ఫక్కున నవ్వింది. "ప్రేమ, పెళ్ళి, అలాటివేవీ లేవు మా మధ్య. జస్ట్ ఫ్రెండ్‌షిప్" అంతే!

అదేమిటీ– కవిత గొంతు చించుకుంది, ముఖం ఎర్రబడింది.

"అంతే అక్కా – ఓ అబ్బాయితో మాట్లాడితే, స్నేహంగా వుంటే ఇక పెళ్ళేనా – నాన్‌సెన్స్ – అతను నా ఫ్రెండు మాత్రమే" కోపంగా గదిలోంచి వెళ్ళిపోయింది రమ. మళ్ళా కళ్ళజోడు సరిచేసుకుంటూ అక్క పక్కన కూర్చుంది.

"ఈ స్నేహాలేమిటో, ప్రేమలేమిటో, పెళ్ళిళ్ళేమిటో నాకేం అర్థం కావటం లేదు" అంది ఎంతో ఆవేదనతో కవిత.

"అర్థం కావలసింది వాళ్ళకి" అన్నాడు విజయ్ సిగరెట్టు ముట్టిస్తూ. మనకి కాదు.

"నూటికి నూరుపాళ్ళు కరెక్టు – రేపు శశికాంత్ పెళ్ళికి వెడుతున్నాం అందరం' అంది.

శశికాంత్ పెళ్ళా – కవిత ఆశ్చర్యంగా రమ వంక చూస్తూ వుండిపోయింది. – ఏమిటో అంతా అస్తవ్యస్తం అంటూ, బుగ్గకి చేయాన్చి, ఈ స్నేహాలు, ఈ ప్రేమలు నాకు ఎప్పటికీ అర్థం కావంతే అనుకుంటూ విచారంగా సోఫాలో కూలబడింది కవిత. నా తరం వేరు. అంతే! దీర్ఘంగా నిట్టూర్చింది.

■